డేడి,

నా మిత్రులతో పార్టీ చేసుకోడానికి నేనో బాటిల్‌ని తీసుకు వెళ్తున్నాను. నీకు కోపం రాదనుకుంటున్నాను.

నీతి: ఎవరి పాపం వారినే కాల్చేస్తుంది కాబట్టి మనం చేసే పనులని పాపరహితంగా ఉంచుకోవడం మన మంచికే.

## 144. దైవ రక్షణ

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటీష్ సైన్యంలో పనిచేసిన జాన్, జార్జ్ అనే ఇద్దరు మిత్రులు బ్రిటన్‌లోని బోల్టన్ అనే ఓ ఊరికి చెందినవారు. జాన్‌కి దైవభక్తి ఎక్కువ. దాంతో మెళ్ళో క్రాస్‌ని వేసుకునేవాడు. జేబులో కూడా ఓ క్రాస్‌ని ఉంచుకుని, మణికట్టుకి ఒకటి కట్టుకునేవాడు.

జార్జ్‌కి దైవ భక్తి లేదు. తన మిత్రుడు జాన్ ఒంటి మీదవి చూసి అతనిది మూఢభక్తి అని నవ్వుకునేవాడు. ఓ సారి జర్మన్స్ మీద డన్‌కిర్క్ అనే చోట ఇద్దరి ప్లెటూన్స్ కలిసి యుద్ధంలో పాల్గొన్నాయి. తమ దగ్గర పేలిన ఓ హేండ్ గ్రనేడ్ ముక్క వచ్చి గుండె లోకి దిగబడి జార్జ్ మరణించాడు. కాని జాన్ మాత్రం ఆ దాడిలో బ్రతికి బయటపడ్డాడు.

గ్రెనేడ్ తునక వచ్చి జాన్‌కి కూడా ఛాతీకి తాకింది కాని, అతని మెడకి వేలాడే లోహంతో చేసిన క్రాస్ అది లోపలకి వెళ్ళకుండా అడ్డుపడింది. ఆ శిలువే అతన్ని కాపాడింది.

## 145. నేర్చుకో

పూర్వం కాశీకి వెళ్ళే దారిలో నర్మదా నదీ తీరంలో ఓ చోట పెద్ద ఎత్తున కట్టె పుల్లలు అనేకం పేర్చి ఉండటం అనేకమంది బాటసారులు చూసేవారు. వాటిని దగ్గరే ఉన్న అడవి లోంచి ఏరి తెచ్చే ఓ ముసలతను కనిపించేవాడు. అంతా ఆయన్ని ఆసక్తిగా అడిగేవారు.